www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 197, బుధవారం 19-8-2026 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam


ఇరిగేషన్.. ఇరిటేషన్



3లో..

మెనూకు మంగళం...



4వ పేజీల్లో

### 22శాతం ఓట్ల తొలగింపు

# దుర్మార్గపు చర్య

**ఇష్టం వచ్చినట్లుగా ఓటు హక్కు తొలగించడం అన్యాయం**

**తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి**

**పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్**




**హైదరాబాద్, ఆగస్టు 18:**

2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో ..మిగతా 2లో

### సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

# గొప్ప యోధుడు

**ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ.. విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి**

**బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు**

**ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం**

**ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం**



**హైదరాబాద్, ఆగస్టు 18 :**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ..మిగతా 2లో

### టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే

# ‘భూ లక్ష్మి పథకం’




**భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి**

**రేవంత్ మాటల్లో సామాజిక న్యాయం చేతుల్లో ఆటవిక పాలన**

**పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం**

**టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

తాము అధికారంలోకి వస్తే ‘భూలకి’ పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పేదల ..మిగతా 2లో



### హైదరాబాద్ మెట్రో ఫేజ్-2

# అనుమతులకు కసరత్తు

**ప్రక్రియను వేగం చేసే పనిలో అధికారులు**

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించిన అనుమతుల పక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన ఎన్‌సీఓలను త్వరగా జారీ చేయాలని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులతో జయేష్ రంజన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్‌ఎమ్‌ఆర్‌ఎల్ ఎండీ, హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ..మిగతా 2లో




# దిమాగీ నక్సల్స్.. మరో పార్టీ పుట్టుక

**ప్రధాని నోట మాటరావడం ఆలస్యం..**

**సోషల్ మీడియాలో ఉత్పన్నం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 18 :**

కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు ..మిగతా 2లో

# క్రిమినల్ కేసుల్లో రేవంత్ టాప్




**పెండింగ్‌లో 89 కేసులు**

**చంద్రబాబుపై 19 కేసులు**

**సుప్రీంకోర్టుకు పిల్ నివేదిక**

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:**

దేశవ్యాప్తంగా సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఏకంగా 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకోర్టుకు తాజాగా అందిన ఒక నివేదిక సంచలనం సృష్టించింది. చట్టసభల్లో కూర్చుని చట్టాలను చేయాల్సిన నాయకులే నేరారోపణలు ఎదుర్కోవడం మన దేశ రాజకీయాల్లో మరోసారి చర్చాంశంగా మారింది. దేశంలో ప్రజాప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించాలని కోరుతూ దాఖలైన పిల్ విచారణలో భాగంగా, కోర్టు నియమించిన అమికస్ క్యూరీ సీనియర్ అడ్వకేట్ విజయ్ హన్సారియా ఈ రిపోర్టును సమర్పించారు. బీజేపీ నాయకుడు, లాయర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ వేసిన ఈ పిటిషన్ రాజకీయ వర్గాల్లో ఇప్పటికే తీవ్ర కలకలం రేపింది. లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో ..మిగతా 2లో

### నేను కూడా దిమాగీ

# నక్సలైట్‌నే

**ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్**



# టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం'

మొదటి పేజీ తరువాయి...

భూములను రేవంత్‌రెడ్డి లాక్కుంటే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారా హిల్స్.. టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి ఇచ్చేలా 'భూ లక్ష్మి పథకం' అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కవిత ప్రకటించారు. రాష్ట్రంలో భూమి పంపిణీ అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూమి కేవలం లావాదేవీల అంశంగా కనిపించవచ్చని, అయితే పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి జీవనాధారమని కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సోదరులపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వారి ఆధ్వర్యంలో భూ దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనను తీవ్రంగా విమర్శించారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల ప్రభావం ప్రభుత్వంలో కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. గత 31 నెలల్లో ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని కవిత ప్రశ్నించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే ముందు కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఒకే రోజు శివధర్‌రెడ్డి, వీహెచ్‌లను సలహాదారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఇద్దరి వేతనాల్లో తేడా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషన్‌లో ఒక్క బీసీకి కూడా అవకాశం కల్పించలేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిత సూచించారు.విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం అటవికా న్యాయమని విమర్శించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఒక రకమైన చర్యలు. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో రేవంత్ రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు.



### 22శాతం ఓట్ల తొలగింపు

# దుర్మార్గపు చర్య

గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిపలు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెపకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. హైదరాబాద్ నగరంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) అనేక ప్రాంతాల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లలేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ముఖ్యంగా పేదలు, వలస కూలీల ఓట్లే పెద్ద సంఖ్యలో తొలగించారని విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎలాంటి కారణం లేకుండా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు కారణంగా 2002 నాటి ఓటర్ల వివరాలతో ప్రస్తుత జాబితాను సరిపోల్చడంలో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడి పెట్టకుండా అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలనిమహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది ఓట్లను తొలగించి ప్రజాస్వామ్య దేశంగా ఎలా చెపకుంటామని మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరిగిన తొలగింపులపై సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఓటర్లకు తిరిగి ఓటు హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# క్రిమినల్ కేసుల్లో రేవంత్ టాప్

మొదటి పేజీ తరువాయి...

సుమారు 251 మందిపై, రాజ్యసభలోని 233 మంది సభ్యులలో 75 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని ఈ నివేదిక వెల్లడించింది.

**ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే..**

ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 4,192 కేసుల్లో 519 కేసులు పదేళ్లకు పైగా కోర్టుల గడప దాటలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరో 700 కేసులు ఇంకా దర్యాప్తు దశలోనే ఉన్నాయి. అందులో 260 కేసులు మూడేళ్లుగా ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఈ కేసుల్లో ఇంకా ఛార్జిషీట్లు కూడా దాఖలు కాలేదు. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం.. కేరళకు చెందిన ఎంపీల్లో ఏకంగా 95 శాతం మందిపై నేరారోపణలు ఉన్నాయి. దేశంలోనే ఇది అత్యధికం అని 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. కేరళ తర్వాత స్థానంలో తెలంగాణ (82 శాతం) నిలిచింది. ఆ తర్వాత ఒడిశా (76 శాతం) ఉంది. అత్యల్పంగా హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లలో ఒక్కో ఎంపీ మాత్రమే కేసులు ఎదుర్కొంటున్నారు. ఇక తీవ్రమైన కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విషయానికి వస్తే.. పశ్చిమ బెంగాల్ (58 శాతం) మొదటి స్థానంలో ఉండగా, కేరళ (57 శాతం) రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ (56 శాతం), తెలంగాణ (49 శాతం), ఒడిశా (45 శాతం) తర్వాతి స్థానాలను ఆక్రమించాయని 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' నివేదించింది.

**ముఖ్యమంత్రులపై కేసులు..**

ఈ నివేదిక ప్రకారం.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధికంగా 89 కేసులు ఉన్నట్లు తేలింది. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన సువేందు అధికారి 29 పెండింగ్ కేసులతో తర్వాతి స్థానంలో ఉన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ఇద్దరూ చెరో 19 కేసులు ఎదుర్కొంటుండగా, కేరళకు చెందిన వీడీ సతీశన్ వద్ద 18 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాలు వెలుగులోకి రావడంతో సిట్టింగ్, మాజీ శాసనసభ్యులపై ఉన్న ఈ కేసులను త్వరితగతిన విచారించడానికి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని అమికస్ క్యూరీ కోర్టును అభ్యర్థించారు. అలాగే, ఈ కేసుల విచారణ పురోగతిని ఆయా హైకోర్టులు స్వయంగా పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన సుప్రీంకోర్టును కోరారు.

### సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్

# గొప్ప యోధుడు

మొదటి పేజీ తరువాయి...

ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం..**

**ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు.**

**గద్వాళ,ఆగస్టు 18:**

గద్వాల పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా గౌడ నాయకులు, బిజెపి జిల్లా పార్టీ ఆద్వర్యంలో క్రిష్ణ వేణి చౌక్ దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన నాయకులు...ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన చూపిన ధైర్యం, సమాజం కోసం చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గౌడ నాయకులు తులసిగౌడు, సందీప్ గౌడు,మధుగౌడు, పవన్ కుమార్ గౌడు, జమ్మిచేడు రామచంద్ర గౌడు, మల్దకల్ వి ఎల్ కుమార్ గౌడు, ఉప్పేరు రఘుగౌడ్ , ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, మాజీ బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, రాష్ట్ర ఓబీసీ మోర్చాకార్యవర్గ సభ్యులు అనిల్ బిజెపి సీనియర్ నాయకులుమాజీ కౌన్సిలర్ నల్లారెడ్డి,శ్రీమన్నారాయణ, శంకర్,బిజెవైఎం నాయకులు పాండు ,మోహన్ రెడ్డి,సతీష్,రమేష్, పవన్ ,బజరంగ్ భాస్కర్,మహిల మోర్చా భారతి తదితరులు హాజరయ్యారు..

# దిమాగీ నక్సల్స్.. మరో పార్టీ పుట్టుక

మొదటి పేజీ తరువాయి...

చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కరాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశలు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం విస్తరణ, పెట్టుబడుల పెంపు, అవినీతి నిర్మూలన, నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాలపై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోడీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా సరికాదు. ఇప్పటివరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయంటే.. చెప్పలేం. ఆందోళనలు చేస్తున్న యువతను చూసైనా పాలకులు కళ్లు తెరవాలి. పేపర్ లీకేజీలతో విద్యార్థుల ఆశలపై నీల్లు చల్లడం వల్లనే కదా యువత ఆందోళన బాట పట్టింది. నీట్ వివాదం ఈ పరిస్థితికి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు నెలల తరబడి ఆందోళనలు చేస్తే, వారి సమస్యలను వినడం, విచారణ జరిపించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లాంటి పనులను ప్రభుత్వం చేయడంలేదు. పైగా నిరసనకారులకు 'పరిష్కారం మీరే చూపండి' అని చెప్పడం ద్వారా ఏం సందేశాన్ని ఇవ్వదలుచుకున్నారో మేడీ చెప్పాలి. ఈ చర్య నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వం పాలనా బాధ్యతలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. పరిష్కారం చూపాలంటే ముందు యువతకు అధికారంలో భాగస్తామ్యం కల్పించాలి. నిజానికి యువత కోరుతున్నది కూడా ఈ దేశ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాముల్ని చేయమని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని అంటున్నారు. తద్వారా వికసిత భారత్‌లో తమను కూడా భాగస్వాములను చేయమంటున్నారు. ఇవి ఏవీ జరగకుండా, అన్నింటికీ దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి ఎలా జరుగుతుందని అనుకుంటున్నారో వివరించాలి. యువత ప్రశ్నలు నీట్‌కే పరిమితం కావాల్సిన అవసరం లేదు. పెరుగుతున్న విదేశీ అప్పు, ధరలు, నిరుద్యోగం, అవినీతి ఆరోపణలు, పరిపాలనలో జవాబుదారీతనం, రాజకీయ ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థల స్వతంత్రతపై వ్యక్తమవుతున్న సందేహాలు.. ఇవన్నీ ప్రశ్నించాల్సిన అంశాలే. అయితే ప్రభుత్వం తన అధికారాన్ని ప్రశ్నను అణచడానికి కాకుండా, సమస్యను పరిష్కరించడానికి వినియోగిస్తే అసలు సమస్యే ఉండదు. కానీ ప్రభుత్వ ధోరణి అలా కనిపించడం లేదు. యువత పరిష్కారాలు చూపాలి, అయితే ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదు అంటే కుదరదు. అందుకుఏ దిమాగీ నక్సల్ అనగానే పార్టీ పుట్టుకు వచ్చింది. ఇది ఓ రకంగా ప్రశ్నించడానికే అనుకోవాలి. ప్రశ్నలకు నాయకులు పరిష్కారాలు చూపించడానికి సిద్ధంగా ఉండాలి.

# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:**

ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోవ్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

### హైదరాబాద్ మెట్రో ఫేజ్-2

# అనుమతులకు కసరత్తు

మొదటి పేజీ తరువాయి...

పాల్గొన్నారు. కేంద్ర అనుమతుల కోసం డీపీఐఐటీ నెట్‌వర్క్ ఎ÷-లానింగ్ గ్రూప్ పక్రియలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఫేజ్?2లో భాగంగా 7 కారిడార్ల ద్వారా మొత్తం 122.9 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన భూసేకరణ, రైల్వే క్రాసింగ్‌లు, మూసీ నది దాటే ప్రాంతాలు, గ్యాస్ పైప్‌లైన్లు, విమానాశ్రయ పరిధిలో నిర్మాణ అనుమతులపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రతిపాదిత కారిడార్లకు అన్ని శాఖలు త్వరితగతిన ఎన్‌సీఓలు జారీ చేయాలని సర్ఫరాజ్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. ఫేజ్?2 పనులు ముందుకు సాగితే హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ మరింత విస్తరించి, నగరంలో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది.



# ఘనంగా సర్దార్ పాపన్న జయంతి

**గద్వాళ,ఆగస్టు18 :**

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను కేటిదొడ్డి మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మండలాద్యక్షుడు యుగందర్ గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న చిత్ర పటానికి గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, మండల నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మండల అధ్యక్షుడు ఉరుకుందు మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల కృషి చేసిన వ్యక్తి సర్వాయి పాపన్న అని, ఆయన జీవిత చరిత్ర నేటి సమాజానికి ఆదర్శమని, పాపన్న ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ నారాయణ ఉప సర్పంచ్ వీరన్నగౌడ్ వార్డ్ మెంబర్లు ఆర్ వీరన్న, జంగిలప్ప నాయకులు కొండన్న, డి.వీరన్న పిల్లి గోవిందు ఫీల్డ్ అసిస్టెంట్ వీరన్న డి రంగస్వామి గౌడ సంఘం నాయకులు పెద్దరాములగౌడ్ చిన్న రాములు గౌడ్, వెంకన్న గౌడ్, అశోక్ గౌడ్ సత్యన్న గౌడ్, వికాస్ గౌడ్ దినేష్ గౌడ్ లింగప్ప గౌడ్ , మీసేవ రవిబాబు, తదిదితరులు పాల్గొన్నారు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
బుధవారం
19 । ఆగస్టు । 2026
Follow :
@bhadradrinews
భద్రాద్రి న్యూస్ తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily


# రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి




**సుజాతనగర్,ఆగస్టు 18 (భద్రాద్రిన్యూస్ ):** రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు రైతులు వరి పంట కాకుండా ఇతర ఆరు తడి పంటలు సాగు చేసుకోవాలని ఇరిగేషన్ డి ఈ భాస్కర్ తెలియజేశారు . మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు కలిసి సమావేశం వరి పంట సాగులపై సలహాలు సూచనలపై సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

సింగభూపాలెం చెరువు ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఈ ఖరీఫ్ సీజన్లో కుడి ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తామని తెలియజేశారు. ప్రస్తుతం ఎలినినో ప్రభావంతో వర్షపాత కారణంగా చెరువులో నీటి సామర్థ్యం తక్కువ ఉన్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాల దృశ్య ఆ యొక్క రైతులు ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో పూర్తిస్థాయిలో నీరు అందించడం అవకాశం ఉండదన్నారు.

వారబంది ప్రకారం వారం విడిచి వారం కుడి ఎడమ కాలువల ద్వారా మాత్రమే నీరు అందిస్తామని తెలిపారు రైతులు తమ సొంత వ్యాయ ప్రయాసాలతో మాత్రమే సాగు చేసుకోవాలని సాగునీరు అందక పంట నష్టం జరిగితే నీటిపారుదల శాఖ అధికారులకు ఎటువంటి బాధ్యత లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ తహసిల్దార్ కృష్ణ ప్రసాద్ ఏవో నర్మద, ఏ ఈ ఈ. నిరోషా ,వర్క్ ఇన్స్పెక్టర్ పోతురాజు వెంకట్రావు ,అధికారులు ,ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నిరుద్యోగ యువతకు పిలుపు**



**చంద్రుగొండ/జూలూరుపాడు ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్)ప్రతినిధి బలరాం నాయక్ :** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని నిరుద్యోగ యువత పోలీసు ఉద్యోగాల సాధనకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్యూఐ మండల అధ్యక్షుడు ఎస్.కె. వసీంపాషా కోరారు.తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు జిల్లాల నిరుద్యోగ యువత కోసం ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ శిక్షణకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో రాష్ట్రస్థాయిలో పేరొందిన అధ్యాపకులతో బోధన, ప్రామాణిక పుస్తకాల ఉచిత పంపిణీ, ప్రతిరోజూ ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు, వారానికి ఒకసారి ప్రత్యేక పరీక్షలు, శారీరక దారుఢ్య సాధన వంటి సౌకర్యాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పోలీసు ఉద్యోగాలు సాధించేలా నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పేర్ల నమోదుకు చివరి తేదీ: 27 ఆగస్టు 2026శిక్షణ ప్రారంభం: 1 సెప్టెంబర్ 2026,మరిన్ని వివరాల కోసం ఖమ్మం: 8985095599, కొత్తగూడెం: 8985096699 నంబర్లను సంప్రదించాలని సూచించారు.నిరుద్యోగ యువతకు అందుబాటులోకి వచ్చిన ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసు ఉద్యోగ సాధన దిశగా ముందడుగు వేయాలని ఎస్.కె. వసీంపాషా కోరారు.

# ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తేవాలి

**- కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై సీపీఎం సర్వే**

**- పీహెచ్‌సీని సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయాలి:**

**కొండబోయిన నాగేశ్వరరావు**



**కారేపల్లి, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్ రాములు):** ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించేందుకు కారేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు కోరారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, సిబ్బంది, మందులు, వైద్య పరికరాలు, అంబులెన్స్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. మంగళవారం కారేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలపై సీపీఎం బృందం సర్వే నిర్వహించింది. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది, మందుల లభ్యత, వైద్య పరికరాలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని పేదలు, గిరిజన ప్రజలు ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. అయితే ఆసుపత్రిలో ఎక్స్‌రే తదితర రోగ నిర్ధారణ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, మాణిక్యారం--చీమలపాడు ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, వైద్యులు, సిబ్బంది, 102 అంబులెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న మహిళా వైద్యురాలు, ఔషధ విక్రేత, పర్యవేక్షకుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

అత్యధిక జనాభా కలిగిన మారుమూల ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువ కావాలంటే స్థానిక ఎమ్మెల్యే, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కారేపల్లి పీహెచ్‌సీని సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సర్వేలో సీపీఎం మండల కార్యదర్శి కే. నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, యనమనగండ్ల రవి, కొండబోయిన ఉమావతి, బానోత్ బన్సీలాల్, తలారి దేవప్రకాష్, కేశగాని ఉపేందర్, ముక్కా సీతారాములు, దాసరి మల్లయ్య, అజ్మీర్ శోభన్, రేగళ్ల మంగయ్య, ముండ్ల ఏకాంబరం, పండగ కొండయ్య, ఎండీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాపర్టీ, దొంగతనం కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

**- పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**





**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (భద్రాద్రిన్యూస్):** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం అధికారులు, సిబ్బందితో స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు.

పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ప్రాపర్టీ కేసులు, దొంగతనం కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించడంతో పాటు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి, చోరీకి గురైన ఆస్తి రికవరీ దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలను వినియోగించే వారిని గుర్తించి వారికి డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ సంబంధిత వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్‌తో పాటు నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ నేరాల ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్-112కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, సీఐ సతీష్, ఎస్సైలు నాగరాజు, సాయి కిషోర్ రెడ్డి, విజయ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో సామాజికన్యాయాన్ని సాధిద్దాం

**- బార్ అసోసియేషన్ అధ్యక్షులు చకిలం ఉపేందర్, చొల్లేటి రామకృష్ణ**

**- వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ లో పాపన్న వర్ధంతి**




**వరంగల్ ,ఆగస్టు 18( భద్రాద్రిన్యూస్ ):** బహుజన వీరుడు, గోల్కొండ ఖిల్లాను ఏలిన రాజు సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వరంగల్ బార్ హాల్ లో మంగళవారం ఘనంగా జరిగింది. వరంగల్, హనుమకొండ బార్ అధ్యక్షులు చకిలం ఉపేందర్, చొల్లేటి రామకృష్ణ లు మాట్లాడుతూ సమస్త పీడిత ప్రజల విముక్తి కోసం సాహసోపేతమైన పోరాటం చేసి గోల్కొండ కోటపై రాజ్య నిర్మాణం చేసిన పాపన్న స్ఫూర్తితో సామాజికన్యాయానికి పెద్ద పీట వేయాలని, న్యాయవాద రంగంలో అణగారిన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే గొప్ప వీరుడిగా పేరుగాంచిన సర్వాయి పాపన్న వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ లో జన్మించడం మనకు గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ కడు పేదరికంలో జన్మించి భూస్వాముల దగ్గర కూలీ చేసుకునే పాపన్న పీడిత ప్రజల కష్టాలను చూసి చలించి ప్రజలను చైతన్యం చేసి, ప్రజల చేత యుద్ధం చేపించి అంతిమంగా ఆనాటి మొగల్స్ రాజ్యాన్ని హస్తగతం చేసుకొని ప్రజా రాజ్యాన్ని ఏర్పాటు చేయడం భారతదేశంలోనే గొప్ప విషయమని అన్నారు. పాపన్న లాంటి ఎందరో బహుజన మహా వీరులు దేశంలో విముక్తి పోరాటాలు చేసి విజయాలు సాధించారని, తీవ్ర నిర్బంధం, ఎలాంటి సౌకర్యాలు లేని కాలంలో పీడిత ప్రజలను చైతన్యం చేసి విముక్తి పోరాటాలను విజయవంతం చేసి రాజ్యాలను ఏలిన ఛత్రపతి శివాజీ, పండుగ సాయన్న, సాహుమహారాజ్ లాంటి వీరుల స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపనకు కృషి చేయాలని అన్నారు. మూడు వందల ఏండ్ల క్రితమే తన రాజ్య పాలనలో సామాజికన్యాయాన్ని అమలు చేసిన పాపన్న స్ఫూర్తితో నేటి రాజ్యంలో సకల సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా దక్కాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శులు నాగేంద్రచారి, ఊరుగొండ నరేందర్, ఉపాధ్యక్షులు సాంబశివరాజు, రఘుపతి, మహిళా ఉపాధ్యక్షులు లలిత కుమారి, వనజ, బార్ అసోసియేషన్ నాయకులు జంగ స్వప్న, ఎస్ కవిత, ఆడెపు సునీల్, ఉమా మహేశ్వరి, గొడిశాల సుజాత, పూసపెల్లి శ్రీనివాస్, మహేందర్ తో పాటు న్యాయవాదులు బత్తిని రమేష్ గౌడ్, శ్రీధర్, రామనాథం, కోటేశ్వరరావు, కిషన్ గౌడ్, పైళ్ల సంతోష్ తదితరులు హాజరై పాపన్న చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు.

# గుడిబండలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

**- దోమలు, కలుపు మొక్కల నివారణకు మందుల పిచికారీ**



**కోదాడ , ఆగస్టు 18(భద్రాద్రి న్యూస్):** కోదాడ మండలం గుడిబండ గ్రామ పంచాయతీ పరిధిలోని పాత గుడిబండ గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. డ్రైనేజీ కాలువల్లో విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించేందుకు కలుపు నివారణ మందును, అలాగే దోమల నిర్మూలన కోసం దోమల నివారణ మందును పంచాయతీ సిబ్బందితో పిచికారీ చేయించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జైసింహారెడ్డి, వార్డు సభ్యులు ఖాజా, రోజా, అనిత, దారా అఖిల, సుహాసిని, సక్రూ మరియు గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

# ఇరిగేషన్.. ఇరిటేషన్




- **పూడుకుపోయిన కాల్వ**
- **తాలిపేరు నీరు రోడ్డు పాలు**
- **రైతులకు సాగునీటి వ్యధ**
- **అధికారుల నిర్లక్ష్యం... అన్నదాతకు శాపం - బాధ్యతారహిత్యంగా ఇరిగేషన్ శాఖ**
- **సాగు నీటిని సక్రమంగా అందించలేని దుస్థితి**
- **అన్నదాతల్లో అసహనం**
- **రాళ్ల గూడెం రైతుల గోడు పట్టించుకునేదెవరు..?**
- **కాగితాల్లోనే పనులు**
- **క్షేత్రస్థాయిలో సమస్యలు**

**ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యం రైతులకు ఇరిటేషన్ తెప్పిస్తుంది. పంట పొలాలకు సక్రమంగా నీళ్లు అందించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్న అధికారుల తీరు వల్ల రైతాంగం నష్టపోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరగాల్సిన పనులపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ తీరుతో తాలిపేరు ప్రాజెక్టు కింద సాగునీరు రైతుల పొలాలకు వెళ్లే విషయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి అయినా సరే పట్టించుకునే నాథుడే కరువయ్యారు**



**చర్ల , ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్):** రైతుల పంట పొలాలకు చేరాల్సిన తాలిపేరు ప్రాజెక్టు సాగునీరు అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుపాలవుతోంది. రాళ్లగూడెం గ్రామ పరిధిలో సాగునీటి కాలువ పూడిక, చెత్తాచెదారంతో పూర్తిగా నిండిపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి, పొలాలకు వెళ్లాల్సిన నీరు ప్రధాన రహదారిపైకి పొంగిపొర్లుతోంది. దీంతో విలువైన సాగునీరు వృథాగా పోతుండగా.. రైతులు మాత్రం పంటలకు నీటి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. రైతుల పొలాలకు నీరు చేరేలా కాలువలను నిర్వహించడం ఇరిగేషన్ శాఖ ప్రాథమిక బాధ్యత కాదా? అని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కాలువలో పూడిక పేరుకుపోయి నీరు పొలాలకు వెళ్లకుండా రోడ్డుపైకి వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రైతులకు అందాల్సిన నీటిని సక్రమంగా మళ్లించలేని పరిస్థితి ఉంటే తాలిపేరు ప్రాజెక్టు నీటి ప్రయోజనం రైతులకు ఎలా అందుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతి చుక్క నీరు రైతుకు ప్రాణాధారం.. అధికారులు మాత్రం పట్టించుకోరా?

ఇప్పటికే వర్షాలు సరిగా లేక సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రాజెక్టు నుంచి అందుబాటులోకి వస్తున్న నీటిని సైతం కాలువల నిర్వహణ లోపంతో రోడ్డుపైకి మళ్లించడం రైతుల పట్ల అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు మండిపడుతున్నారు. పంటలకు చేరాల్సిన నీరు రోడ్డుపై ప్రవహిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ రైతులు నిలదీస్తున్నారు. కాలువలో పూడిక తొలగించడం, నీటి ప్రవాహాన్ని సక్రమంగా మళ్లించడం వంటి కనీస చర్యలు కూడా చేపట్టకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### సాగునీరు వృథా.. రహదారిపై ప్రమాద ముప్పు

కాలువ నుంచి పొంగిపొర్లుతున్న నీరు ప్రధాన రహదారిపైకి చేరుతుండటంతో వాహనదారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై నీరు నిలిచి ఉండటంతో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సాగునీటి సమస్యతో పాటు ప్రజల రహదారి భద్రతకు కూడా ఈ పరిస్థితి ముప్పుగా మారిందని పేర్కొంటున్నారు.

### ఇంకెంతకాలం నిర్లక్ష్యం?

సమస్య కళ్లముందే కనిపిస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై రాళ్లగూడెం రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగితాలపై పనులు చూపించడం కాదు.. క్షేత్రస్థాయిలో కాలువను పరిశీలించి పూడికను తొలగించి నీటిని పొలాలకు మళ్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు తక్షణమే గ్రామాన్ని సందర్శించి కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టి తాలిపేరు నీరు ప్రతి ఎకరాకు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతుల పంటలకు చేరాల్సిన నీరు రోడ్డుపై వృథాగా పారిపోతుంటే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని, అధికారులు ఇప్పటికైనా మేల్కొని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రాళ్లగూడెం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా భావించి ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే స్పందించాలని వారు కోరుతున్నారు.



# సింగరేణిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి

*– పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: గౌడ సంఘం*




**కారేపల్లి, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్ రాములు):** ఖమ్మం జిల్లా సింగరేణి (కారేపల్లి) మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక సమానత్వం, ప్రజల సంక్షేమం కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.గౌడ సామాజిక వర్గం ఐక్యతను మరింత బలోపేతం చేసుకుంటూ విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమాజ అభ్యున్నతికి యువత చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, యువత, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో సీఎంఆర్ అవకతవకలు...మిల్లర్ అరెస్ట్




**కోదాడ, ఆగస్టు 18(భద్రాద్రి న్యూస్):** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని విజయలక్ష్మీ రైస్ కార్పొరేషన్ మిల్లులో విజిలెన్స్ సీఐ దశరథ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యంపై విచారణ చేపట్టారు. 2024, 2025, 2026 సీజన్లకు సంబంధించి మొత్తం 4,736.7 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వానికి 13.51 కోట్ల రూపాయలు మిల్లు యాజమాన్యం బాకీ ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిల్లు యజమాని మేళ్లచెరువు శంకర్రావును పోలీసులు అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. సీఎంఆర్ చెల్లించని మిల్లులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆత్మీయ నాయకుడు అడ్డగోడ ఐలయ్యకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

**- ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలి.. డా. బాదావత్ రవి**




**కారేపల్లి, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్ రాములు):** సౌమ్య స్వభావం, ఆత్మీయ పలకరింపుతో అందరినీ కలుపుకుపోయే వ్యక్తిత్వం కలిగిన సీనియర్ రాజకీయ నాయకులు, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్యకు మిషన్ వాక్ ఫౌండర్ డా. బాదావత్ రవి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. బాదావత్ రవి మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ ఐలయ్య తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని అన్నారు. రాజకీయ, సామాజిక రంగాల్లో ఆయనకు ఉన్న అనుభవం ఎంతో విలువైనదని, రాబోయే తరాలకు ఆయన సేవా ప్రయాణం స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల పట్ల ఆత్మీయత, సేవాభావంతో ముందుకు సాగుతున్న ఐలయ్య మరిన్ని విజయాలు సాధించాలని, సమాజ అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని కోరారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవిస్తూ మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. అడ్డగోడ ఐలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆయన ప్రతి అడుగు విజయవంతం కావాలని డా. బాదావత్ రవి మనస్ఫూర్తిగా కోరారు.

# వైరాలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు

**- బహుజన పోరాట యోధుడు**

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ - బొర్రా రాజశేఖర్ గౌడ్**

**- బహుజన రాజ్యాధికారం కోసం అహర్నసులు శ్రమించిన వ్యక్తి**

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్- బొర్రా**



**వైరా, ఆగస్టు 18, (భద్రాద్రి న్యూస్ )** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ దగ్గర సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముందుగా తెలంగాణ రాష్ట్ర మాజీ మార్క్ ఫైడ్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి బొర్రా రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజన పోరాట యోధుడు అని ఆయన జయంతి వేడుకలను జరుపుకోవడం బహుజన సమాజాని గుర్తు చేసుకోవడమే అని, బహుజనుల రాజ్యాధికారం కోసం అహర్నాసులు శ్రమించిన వ్యక్తి పాపన్న గౌడ్ అని, ఆయన చేసిన త్యాగం మరోలేనిది, మరిచిపోనిది అని, ఆయన త్యాగం, దేశ చరిత్రలోనే శిరస్థాయిగా నిలిచిపోయాయని, కులమత బేధాలు లేకుండా అందరి కోసం పోరాడిన వ్యక్తి పాపన్న గౌడ్ అని, భవిష్యత్తులో బహుజన రాజ్యాధికారం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని, ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా పట్టణ పరిసర గౌడ బంధువులందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తదుపరి బైక్ ర్యాలీ నిర్వహించారు. గౌడ కుటుంబ సభ్యులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీల అమలుకు గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె

**- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి..**

**మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి**

**- హామీలు అమలు చేయకపోతే**

**దీర్ఘకాలిక సమ్మెకు సిద్ధం: సీఐటీయూ**




**కారేపల్లి, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్ రాములు):** ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సింగరేణి మండలంలోని 41 గ్రామపంచాయతీలకు చెందిన కార్మికులు మంగళవారం సమ్మె చేపట్టారు. కారేపల్లి స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద టెంట్ ఏర్పాటు చేసి రిలే దీక్షలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సీఐటీయూ సింగరేణి మండల కన్వీనర్ కే. నరేంద్ర మాలలు వేసి రిలే దీక్షలను ప్రారంభించారు. యూనియన్ మండల కార్యదర్శి ఎస్. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరేంద్ర మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో కాంగ్రెస్ నాయకులు వారి వద్దకు వచ్చి సమస్యలు న్యాయమైనవని పేర్కొన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, జీవో నంబర్ 51ను సవరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం విచారకరమని నరేంద్ర విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, జీవో నంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో జీతాలు జమ చేయాలని, అక్రమంగా సిబ్బందిని తొలగిస్తున్న గ్రామపంచాయతీ సర్పంచులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల దహన సంస్కారాలకు కనీసం రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం సమస్యల పరిష్కారం కోసం రెండు రోజులపాటు సమ్మె నిర్వహిస్తున్నామని నరేంద్ర తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో సుదీర్ఘ సమ్మెకు దిగడంతో పాటు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలను సైతం నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇందుకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే. హుస్సేన్, మండల కోశాధికారి గుగులోతు శ్రీను, నాయకులు బోళ్ల కొమరయ్య, పాలిక తిరపయ్య, యాదగిరి, ఉపేందర్, సుల్తానా, హేమచంద్, సుక్య, అచ్చయ్య, హిట్లర్, మంగీలాల్‌తో పాటు పలువురు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# మెనూకు మంగళం...

**- కుళ్ళిన కూరగాయలతో భోజనం..**

**- విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**




**భద్రాద్రి న్యూస్, ఆగస్టు 19దమ్మపేట:** మండలంలోని పెద్దగొల్లగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, వంటగది, సరుకుల నిల్వ గది, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.

తనిఖీల్లో అన్నం సరిగా ఉడకకపోవడం, మెనూ ప్రకారం వంటలు చేయకపోవడం, మధ్యాహ్నం తయారు చేసిన చారును సాయంత్రం తిరిగి వేడిచేసి విద్యార్థులకు అందిస్తున్నట్లు గుర్తించారు. అలాగే నిల్వ గదిలో అపరిశుభ్రతతో పాటు కుళ్లిపోయిన కూరగాయలు కనిపించడంతో సిబ్బందిపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, మెనూ అమలు, అందుతున్న ఆహారంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎంపీ రఘురామ్ రెడ్డి హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో ముచ్చటించి విద్యా ప్రమాణాలపై ఆరా
- భోజనం, వసతులు, ప్రయోగశాలలను పరిశీలించిన కలెక్టర్
- నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి






**కారేపల్లి, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్--రాములు):** సింగరేణి మండలం రేలకాయలపల్లి గ్రామంలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వివిధ పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అవగాహన, అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధన, పాఠశాలలోని సౌకర్యాలపై వారి నుంచి నేరుగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని భౌతిక, రసాయన, జీవశాస్త్ర ప్రయోగశాలలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య ఏ మేరకు అందుతోంది, అవసరమైన పరికరాలు, సామగ్రి అందుబాటులో ఉన్నాయా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వసతి గృహాలను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, మెనూ అమలు, వంటశాల పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం అందేలా అధికారులు, పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్టమైన పునాది వేసేలా విద్యాబోధన ఉండాలని, పాఠశాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో పాఠశాల అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# అమెరికా వెళుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలిసిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

- అమెరికా వెళ్లి తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకురావాలి- ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లాలి - ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**వైరా, ఆగస్టు 18,( భద్రాద్రి న్యూస్ )**

వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అమెరికా పర్యటనకు బయలుదేరుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్ చర్చించారు. వైరా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సాగునీరు, విద్య, వైద్యం, తదితర అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అమెరికా పర్యటనలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు, తీసుకువచ్చి తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని, వైరా నియోజకవర్గ అభివృద్ధికి కూడా ప్రత్యేక సహకారం అందించాలని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి



ఎమ్మెల్యే మాలుత రామదాసు నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విజయవంతం కావాలని తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని నిధులు, పెట్టుబడులు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ హ్యాపీ జర్నీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎఫ్.ఎల్.ఎన్ నైపుణ్య పాఠశాలల్లో విద్యార్థులకు సీఆర్పీ ల స్పాట్ అసెస్‌మెంట్ నిర్వహణ....




**మునుగోడు ఆగస్ట్ 18 (భద్రాద్రి న్యూస్ ):** విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం మునుగోడు మండలం కొంపల్లి కాంప్లెక్స్ లోని ఎఫ్.ఎల్.ఎన్ నైపుణ్య పాఠశాలలు ప్రాథమిక పాఠశాల కొంపల్లి మరియు ప్రాథమిక పాఠశాల చొల్లేడులో 2వ తరగతి విద్యార్థులకు స్కూలు ఎడ్యుకేషన్ ఆప్ ద్వారా స్పాట్ అసెస్‌మెంట్ ను సి.హెచ్.నాగరాజు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నిర్వహించారు. విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత, పఠనం, రచన, గణిత నైపుణ్యాలను యాప్‌లో నేరుగా నమోదు చేస్తూ వారి అభ్యాస స్థాయిని తక్షణమే అంచనా వేస్తున్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యానికి అనుగుణంగా తదుపరి బోధన ప్రణాళిక రూపొందించేందుకు ఈ మూల్యాంకనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎఫ్.ఎల్.ఎన్ లక్ష్యాల సాధనలో భాగంగా ప్రతి విద్యార్థి నేర్చుకునే ఫలితాలను మెరుగుపరచడమే ఈ స్పాట్ అసెస్‌మెంట్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి, చొల్లేడు ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు గడ్డం.వెంకటయ్య, ఈసారపు.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ జయంతి



**కోదాడ, ఆగస్టు 18(భద్రాద్రి న్యూస్):** కోదాడ మండలం గుడిబండ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘం సభ్యులు అత్యంత ఘనంగా నిర్వహించారు. సామాజిక సమానత్వం, బహుజనుల ఆత్మగౌరవం, మరియు రాజ్యాధికారం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుడిబండ గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ.. నాడు నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆ మహా యోధుడి ఆశయాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. పాపన్న గారి స్ఫూర్తితో మనమందరం సమాజంలోని అణగారిన వర్గాల అభివృద్ధికి, సమానత్వం మరియు సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు

# ఘనంగా కంచర్ల చంద్రశేఖర్ రావు 75వ పుట్టినరోజు వేడుకలు



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మరియు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల చంద్రశేఖర్ రావు 75వ పుట్టినరోజు సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు సీనియర్ ఐఎన్టియుసి నాయకులు, మాల మహానాడు రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎస్. మధుసూదన్ రావు (చిన్ని) నాయకత్వంలో కంచర్ల చంద్రశేఖర్ ను ఘనంగా సత్కరించారు. కార్యకర్తలతో చంద్రశేఖర్ కలుసుకొని శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, మిఠాయిలు తినిపించి చంద్రశేఖర్ ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రావు ( చిన్ని ) మాట్లాడుతూ... దేవుడు కంచర్ల చంద్రశేఖర్ రావు కు అష్టైశ్వర్యాలు, మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థింస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సిహెచ్. జాన్సన్ సుధాకర్, జె. శ్రీనివాస్, ఎం. వెంకట్ రెడ్డి, మాల మహానాడు జిల్లా నాయకులు ఎస్ నాగేందర్ (బుస్సీ ), మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా అధ్యక్షురాలు నక్కా సృజన, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసు, నిస్సార్, ఎస్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యకర్త వీరాభిమాని లావుడ్యా రవికుమార్ మృతి పట్ల కాంగ్రెస్ నాయకుల సంతాపం



**కామేపల్లి,ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్) :** కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్, క్రియాశీల కార్యకర్త వీరాభిమాని లావుడ్యా రవికుమార్ అకాల మరణం చెందడం పట్ల కాంగ్రెస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. రవికుమార్ మరణవార్త విన్న వెంటనే పలువురు కాంగ్రెస్ ముఖ్య నేతలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి అశ్రునయనాల మధ్య నివాళులర్పించారు. ?అనంతరం మృతుడి నివాసానికి వెళ్లిన నాయకులు,తీవ్ర శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, నిరంతరం శ్రమించిన నిజాయితీ గల కార్యకర్తను కోల్పోవడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. రవికుమార్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ? ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రవికుమార్ భౌతికకాయాన్ని పరామర్శించిన కామేపల్లి సొసైటీ చైర్మన్ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, కామేపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు,ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.కె పత్తే మహమ్మద్, కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు, గోవింద్రాల ఉపసర్పంచ్ తారా శివలతో పాటు పార్టీ నాయకులు మూడు మంగీలాల్, లావుడ్యా వినోద్, హట్కర్ బద్రు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా పోటీలకు రావాలని భద్రాద్రి జిల్లా ఎస్పీకి ఆహ్వానం

**- జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**




**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్) :** ఈనెల 30వ తేదీన పాల్వంచ ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్ లో జరగనున్న జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలకు హాజరుకావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్, యూనిటీ గోల్డ్స్ జిమ్ నిర్వాహకులు ఎం.డి.నూర్,ఎండి.జాకీర్ ఆహ్వాన పత్రికను అందజేశారు. కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజును ఆయన ఛాంబర్ లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పోటీల గురించి వివరించి పోటీల ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత పెరిగిందని అందులో భాగంగా జిల్లాలో క్రీడలు,క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశ్యంలో జిల్లా స్థాయి ఎంకరేజ్మెంట్ బెంచ్ ప్రెస్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలు

**- బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్**



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్) :** బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలను కారుకొండ రామారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కారుకొండ రామారం గ్రామంలో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ మాట్లాడుతూ... మొఘల్ పాలకుల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన రాజ్య స్థాపన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. "కొడితే గోల్కొండ కోటనే కొట్టాలే" అనే స్ఫూర్తితో పోరాడిన పాపన్న గౌడ్ ధైర్యం, త్యాగం, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఆయన ఆశయాలను నేటి యువతకు, భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని కొత్తగూడెం ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా శీలం విద్యాసాగర్ ప్రకటించారు. పాపన్న గౌడ్ చరిత్రకు తగిన గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కారుకొండ గ్రామవాసులు, గౌడ సంఘం కుల పెద్దలు, బీజేపీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు రాయుడు నాగేశ్వరరావు, కనకుంట్ల రాజమౌళి, నోముల రమేష్, సాంబ గౌడ్, కొత్తగూడెం పట్టణ ప్రధాన కార్యదర్శి చంద్రగిరి రమేష్, భాస్కర్ గౌడ్, గిరి తదితరులు పాల్గొని సర్దార్ పాపన్న గౌడ్ గారికి ఘన నివాళులర్పించారు.

# జిపి మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**- సిఐటియు యూనియన్ మండల కన్వీనర్ బాదావత్ శ్రీను నాయక్**

**- రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్**



**కామేపల్లి,ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్):-** గ్రామ పంచాయతీ మల్టీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమంలో డిమాండ్ చేసింది. ఈ నెల 18, 19 తేదీలలో చేపట్టనున్న నిరాహార దీక్షల ముందస్తు చర్యల్లో భాగంగా కామేపల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ధరావత్ సోములాల్ నాయక్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శ్రీను,వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మరాఠీ నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్కర్లపై పని ఒత్తిడిని తగ్గించాలని,కనీస వేతనం ?26,000 చెల్లించాలని కోరారు. అలాగే మరణించిన వర్కర్ల కుటుంబాలకు ?30,000 మట్టి ఖర్చులు అందించాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మేకల మల్లికార్జున రావు, శేషయ్య,రాంబాబు, రాము,అనంత రాములు,గోపాల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్) :** చుంచుపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం సంబవించిన వ్యక్తికీ 108 అత్యవసర వైద్యం సేవల సిబ్బంది సమయస్ఫూర్తితో స్పందించి ప్రాణాపాయం నుంచి బయటపడేలా చేశారు. చుంచుపల్లి నివాసి అజ్మీర మోహన్ (38) సోమవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా చుంచుపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా మారింది. స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించగా, ఈఎంటీ స్రవంతి, పైలట్ సాంబశివరావు వేగంగా సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించారు. రక్తస్రావాన్ని అదుపు చేసి మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమయానికి స్పందించి బాధితుడి ప్రాణాపాయం తప్పించిన 108 సిబ్బంది సేవలను స్థానికులు, కుటుంబ సభ్యులు ప్రశంసించారు.

# గౌతంపూర్ బీఎల్ఓలకు ఘన సన్మానం



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్) :** గౌతమ్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన బీఎల్‌ఓలు పద్మ, ఈశ్వరి, శివలీల, మస్తాన్‌ను గౌతంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సపావత్ కళ్యాణి, ఉప సర్పంచ్ గంగారం, పంచాయతీ కార్యదర్శి షర్మిల పూలమాలలు, శాలువాలతో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంలో బీఎల్‌ఓలు బాధ్యతాయుతంగా పనిచేసి సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పెనగడపలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్) :** చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప గ్రామ పంచాయతీ నడి ఒడ్డు గ్రామంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చర్యలను చేపట్టారు. గ్రామ సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ మహమ్మద్ గోరిబాబు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామంలోని వీధులు, కాలువలు, దోమలు అధికంగా ఉండే ప్రాంతాల్లో దోమల మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో పారిశు ధ్య పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెచ్ఈఓ రవి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికా సంరక్షణ పథకం ఎల్ఐసీ బాండ్ల క్లెయిమ్‌కు దరఖాస్తుల ఆహ్వానం




**కోదాడ, ఆగస్టు 18(భద్రాద్రి న్యూస్):** బాలికా సంరక్షణ పథకం (GCPS)-2005 కింద ఎల్ఐసీ బాండ్లు పొంది, మెచ్యూరిటీ పూర్తయిన అర్హులైన లబ్ధిదారులు తమ బాండ్లను క్లెయిమ్ చేసుకోవాలని కోదాడ సెక్టార్ సీడీపీఓ కిరణ్మయి ఒక ప్రకటనలో సూచించారు. అర్హులైన బాలికలు తమకు సంబంధించిన పూర్తి పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.కావలసిన పత్రాల వివరాలు:లబ్ధిదారులు ఈ క్రింది పత్రాలను మూడు(3) సెట్ల జిరాక్స్ కాపీలతో పాటు ఒరిజినల్ పత్రాలను వెంట తీసుకురావాల్సి ఉంటుంది,ఒరిజినల్ ఎల్ఐసీ బాండ్ఎల్ఐసీ బాండ్ ప్రొసీడింగ్ ఒరిజినల్ మరియు జిరాక్స్ బాలికల 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమోల సర్టిఫికేట్స్ జిరాక్స్ బాలికల ఆధార్ కార్డ్ జిరాక్స్ బాలిక బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్అంగన్‌వాడీ టీచర్ ధృవీకరణ పత్రంతల్లిదండ్రుల ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలు మరియు రేషన్ కార్డ్ వివాహం జరిగినట్లయితే మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జిరాక్స్3 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు3 రెవిన్యూ స్టాంపులుఅర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం తమ సమీపంలోని అంగన్‌వాడీ టీచర్‌ను సంప్రదించాలని సీడీపీఓ కిరణ్మయి పేర్కొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర యాదవ చైతన్య వేదిక

## - రాష్ట్ర అధికార ప్రతినిధిగా జాలే శ్రీను యాదవ్ ఏకగ్రీవంగా నియామకం

**- బీసీల రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తామని వెల్లడి**



**కామేపల్లి,ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్):** యాదవలు సమాజ లో అభివృద్ధి వైపు ప్రయాణించే దిశగా ముందుకు సాగాలని వారికి చైతన్యం పరిచేందుకు సామాజిక,ఆర్థిక, రాజకీయ పురోగతే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్రంలో యాదవ చైతన్య వేదిక ఏర్పాటు చేయడం జరిగింది. దానిలో భాగంగా ఖమ్మం జిల్లా ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని కామేపల్లి మండలం పరిసర ప్రాంతమైన మద్దులపల్లి గ్రామ నివాసి అయిన జాలే శీను యాదవ్ ను రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర యాదవ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గొర్ల అయిలేష్ యాదవ్ మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ?ఈ సందర్భంగా జాలే శ్రీను యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు గొర్ల అయిలేష్ యాదవ్‌కు ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సంఘ రాష్ట్ర నాయకులు కురాకుల నాగభూషణం యాదవ్,జక్కుల శ్రీను యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. చట్టసభల్లో రిజర్వేషన్ల సాధనే ధ్యేయం పనిచేస్తానని యాదవులకు ఏ కష్టం వచ్చినా ముందుండి పరిష్కరించి న్యాయం జరిగే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కార మార్గం చూపుతానని పాలు పేర్కొన్నారు ఈ సందర్భంగా జాలే శ్రీను యాదవ్ తెలుపుతూ యాదవులను రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు బీసీల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీలందరినీ ఒకే వేదికపైకి తెచ్చి సంఘటితం చేస్తామని, చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల సాధన కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**ఐక్యతతోనే హక్కుల సాధన కోసం ఉద్యమించాలని**

యాదవ సమాజ అభివృద్ధికి ఐక్యతే ఏకైక మార్గమని ఈ సందర్భంగా వేదిక పై నుండి నాయకులు పిలుపునిచ్చారు. సమాజంలో మన హక్కులను కాపాడుకోవడానికి, యువతకు తగిన అవకాశాలు కల్పించడానికి, విద్య రాజకీయ రంగాలలో బలమైన భాగస్వామ్యాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని కోరారు. సమాజం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను ధీటుగా ఎదుర్కొనేందుకు ప్రతి యాదవ సోదరుడు, సోదరి ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు.

?రాబోయే రోజుల్లో సమాజ సంక్షేమానికి కట్టుబడి ఉంటామని, యాదవ ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయి సమావేశాలు, ఏర్పాటుచేసి చైతన్య అవగాహన కార్యక్రమాలు చేపడతామని నాయకులు వెల్లడించారు. తరతరాల భవిష్యత్తు కోసం, హక్కుల పరిరక్షణ కోసం యాదవులందరూ ఈ ఐక్యతా ఉద్యమంలో క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల కోసం కొల్లి ఫౌండేషన్ చేయూత అమోఘం

**- స్టేషన్ బేతంపుడిలోని సర్పంచ్ వాంకుడోత్ శ్రీకాంత్**




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్ మండలం, స్టేషన్ బేతంపుడిలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక ఆదర్శ పాఠశాల మౌలిక సదుపాయాల కోసం గతంలో హామీ ఇచ్చిన విధంగా కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి పుట్టినరోజు సందర్భంగా సర్పంచ్ వాంకుడోత్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మోడల్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ స్టేషనరి పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో సర్పంచ్ వాంకుడోత్ శ్రీకాంత్ మాట్లాడుతూ... కొల్లి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అమూల్యమైనవని, ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా కొల్లి ఫౌండేషన్ అండగ నిలవడమే కాక, పాఠశాలలో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మునుముందు కూడా తమ గ్రామాభివృద్ధి కోసం కొల్లి ఫౌండేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా కల్పనా చౌదరి మాట్లాడుతు... విద్యార్థులు బాగా చదువుకుని, ఉద్యోగాలు సాధించి, ఇటు గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై శ్రద్ధ వహించి చదువులో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. రాబోయే రోజుల్లో కూడా కొల్లి ఫౌండేషన్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఎర్రమ్మ, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు భూక్యా మాన్సింగ్ నాయక్, చంద్రు నాయక్, బిక్కు నాయక్, భద్రు,హేమంత్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.